# ఉపాధ్యాయుల జీతాల మంజూరులో జాప్యం తగదు

## - ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి

నంబులపూలకుంట, జులై 18 ప్రభాతవార్త

బదిలీలు పదోన్నతుల్లో భాగంగా కొత్తగా మంజూరైన పోస్టులలో చేరిన ఉపాధ్యాయుల జీతాల మంజూరులో జాప్యం తగదని వెంటనే జీతాలను మంజూరు చేయాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరణ చేసి మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులను, అదనపు ఉపాధ్యాయులను, ఉన్నతీకరణ చేసిన పాఠశాలలకు గ్రేడ్2 హెచ్ఎంలను నియమించారని దీనిని సంఘ పక్షాన స్వాగతిస్తున్నా మని, కాని ఆయా స్థానాలలో కేటాయించిన ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు ఇంతవరకు మంజూరు చేయకపోవడం అన్యాయమ న్నారు. కొత్తగా మంజూరైన పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతితో పాటు ఖజానా శాఖ పొజిషన్ ఐడీలు కేటాయించి విద్య, ఖజానా శాఖల మధ్య సమన్వయలోపంతో ఈరోజు వరకు ప్రక్రియ పూర్తీ కాని నేపథ్యం. ఇప్పటికే ఉపాధ్యాయులు జూన్ నెల జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. కొత్తగా క్రియేట్ చేసిన పోస్టుల వివరాలను ఖజానా శాఖకు తెలియపరిచిన ఎడల అందుకు అనుగుణంగా ట్రెజరీ శాఖ కొత్తగా పాఠశాలలో నియమి తులైన టీచర్లకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చేయా ల్సి ఉంది. రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో ఉపాధ్యా యులకు జీతాలందని దుస్థి తిని విమర్శించారు. సమన్వ య లోపమే శాపంగా ఉన్న నేపథ్యంలో వెంటనే మంజూరైన పోస్టులకు పొజిషన్ ఐడీలు క్రియేట్ చేసి జూన్, జూలై నెలల జీతాలు తక్షణం మంజూరయ్యేలా ప్రభు త్వం చొరవ చూపాలని తెలిపారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జవహ ర్ మాట్లాడు తూ..2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, పాఠశాల స్థాయిలో బోధనేతర పనులు రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమి తం చేయాలని, పెండింగ్ డిఏలను, 30 శాతం మధ్యం తరభృతిని ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు రామాంజనేయులు, ఉపా ధ్యక్షులు తిరుమల ప్రసాద్, కార్యదర్శి రమేష్, ప్రధానోపాధ్యాయులు శాంత మ్మ, గంగయ్య, రాజశేఖర్, సాంబశివారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, చిన్నోడు, శ్రీవాణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# తిమ్మంపల్లిలో మరోసారి కేతిరెడ్డి పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

## - పెద్దారెడ్డి హౌస్ అరెస్ట్ - పెద్దారెడ్డి ఇంటి వద్దకు భారీగా చేరుకున్న వైసిపి కార్యకర్తలు

యల్లనూరు, జులై 18 ప్రభాతవార్త

రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రిలో నిర్వహించడానికి తిమ్మంపల్లిలోని ఆయన నివాసం నుండి ఉదయాన్నే బయలుదేరుతుండగా విషయం తెలుసుకున్న డిఎస్పి వెంకటేశ్వర్లు, సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డిలు అక్కడికి వెళ్లి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లకుండా అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం శుక్రవారం తాడిపత్రిలో నిర్వహించాలని అనుకుంటే పోలీసులు గురువారం రాత్రి నా ఇంటిని చుట్టుముట్టారని, నేను వెళితే లా అండ్ ఆర్డర్ సమస్య అవుతుందని చెపుతున్నారని 14 నెలల నుండి ఇదే పరిస్థితి అని పోలీసులపై మండిపడ్డారు.

నేను తాడిపత్రికి వెళతానని చెప్పడం అది తెలుసుకొని జె.సి ప్రభాకర్‌రెడ్డి చెప్పినట్లుగా పోలీసులు పనిచేస్తూ తనను అడ్డుకోవడం ఇదే జరుగుతోంది తప్పా హై కోర్టు ఆదేశాలు వున్నా నన్ను పంపడం లేదని నియోజకవర్గంలో పార్టీ కార్యక్ర మాలు జరుగుతుంటే నేను వెళ్లి నా కార్యకర్తల కోసం పని చేయకూడదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు రేపు ఎట్టి పరిస్థితుల్లో అయినా తాడిపత్రికి వెళ్లి తీరు తాన ని లేదంటే నేను యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో కూర్చుంటానని పెద్దారెడ్డి తెలిపారు.



పెద్దారెడ్డి కారును అడ్డుకుంటున్న పోలీసులు



మీడియాతో మాట్లాడుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

# ఉన్నత పాఠశాలల పనివేళలు పాత పద్ధతినే కొనసాగించాలి

## - ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్

యాడికి, జూలై 18 ప్రభాతవార్త

మండలంలోని యాడికి, రాయలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పని వేళల్లో మార్పు చేయరాదని పాత పద్ధతిని కొనసాగించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని శుక్రవారం ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్, సంఘం సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాశక్తి పథకం ద్వారా ప్రభుత్వ పరమైన ఉత్తర్వులు లేకుండా కేవలం మౌఖిక ఆదేశాలతో 1 గంట అదనంగా తరగతులు నిర్వహించాలని కేవలం మౌఖిక ఆదేశాలతో, అశాస్త్రీయమైన విధానాన్ని కొనసాగించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం సరైందికాదన్నారు.

విద్యార్థుల మానసిక స్థితి, అభ్యసన సామర్థ్యాలు, భావోద్వేగాలు, అనుసరించి మనో వైజ్ఞానిక శాస్త్రవేత్తలు నిర్ణయించిన పని వేళలు మార్చడం ఎంతవరకు సమంజసమో అధికారులే సమాధానం చెప్పాలన్నారు. ఈ పథకం ద్వారా మండలాల్లో కొన్ని స్కూళ్లు మాత్రమే ఎంపిక చేయడం సబబు కాదన్నారు. మండలంలో యాడికి, రాయలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కెజిబివి, మోడల్ స్కూల్ మాత్రమే ఎంపిక చేయడం అందులోనూ కేవలం సైన్సు, ఆంగ్లం, గణితం మాత్రమే అమలుపర్చడం దీన్ని ఏ ప్రామాణికంగా తీసుకున్నారని వారు ఆక్షేపించారు. సుదూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుండి వస్తున్న విద్యార్థినిలకు రక్షణ రవాణా సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. విద్యాశాఖ అధికారులు విద్యార్థుల మానసిక స్థితి, స్థానిక పరిస్థితుల దృష్ట్యా, పని వేళలు యధావిధిగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగించాలని దీనిపై అధికారులు పునః పరిశీలన చేయాలని ఏపిటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జయప్రసాదరావు, నబీరసూల్, జిల్లా కౌన్సిలర్ జి.విశ్వనాథ్, సంఘ సభ్యులు వారిస్, రవికుమార్, రాజశేఖర్‌నాయుడు, మల్లికార్జునరాజు, చంద్రశేఖర్, జయరాం తదితరులు కోరారు.



ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్

# అతివేగంతో ఇంటిలోకి దూసుకెళ్లిన కంటైనర్

తనకల్లు, జూలై 18 ప్రభాతవార్త

మండలంలోని సిజి ప్రాజెక్ట్ గ్రామంలో కంటైనర్ ఇంట్లోకి దూసుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఒక ద్విచక్రవాహనం, ఆటో, మెకానిక్ షెడ్డు ధ్వంసమయ్యాయి. ఈ కంటైనర్ పెనుకొండ కియా పరిశ్రమకు వెళుతోంది. కియా పరిశ్రమ ఏర్పాటైనప్పటి నుండి కొక్కంటి క్రాస్ నుండి మహమ్మదాబాద్ క్రాస్ వరకు తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఈ కంటైనర్ల వల్ల జరిగిన ప్రమాదాల్లో పలు గొర్రెలు మృతి చెందగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు దెబ్బతినడంతో పాటు పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు లేకపోలేదు. తరుచూ ఈ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకునే నాథుడే లేడు. సోమశేఖర్ అనే వ్యక్తి మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవాడు. అయితే ఈ కంటైనర్ ప్రమాదవశాత్తు తీసుకెళ్ల దంతో ప్రాణాలతో బయటపడగా దాదాపు 6 లక్షల రూపాయలకుపైగా ఆస్తి నష్టం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి కంటైనర్లు అతివేగం తగ్గించి వెళితే ప్రమాదాలు జరిగే అవకాశాలు లేవని లేకపోతే ఇంకా ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశాలు వున్నాయని వీటిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కంటైనర్ దూసుకెళ్లిన సంఘటనలో తీవ్రంగా నష్టపోయిన సోమశేఖర్‌కు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇంటిలోకి దూసుకెళ్లిన కంటైనర్



కంటైనర్ ఢీ కొనడంతో నుజ్జు నుజ్జు అయిన ఆటో

# ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలు వినియోగించుకోండి

## - బ్యాంకు మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి

తనకల్లు, జూలై 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి తెలియచేశారు. మండల కేంద్రంలోని చంద్రబాబు నాయుడు కాలనీలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలు గురించి శుక్రవారం ఖాతాదారులకు తెలియచేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతు బ్యాంకు సేవల గురించి వివరిస్తూ ప్రతి ఒక్కరికి బ్యాంకు అకౌంట్ వుండాలని అలాగే జీవన సూర్షహ బీమా పథకాల ద్వారా ప్రతి ఒక్కరు లబ్ది పొందాలన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని చెల్లించినచో ప్రభుత్వం నుండి వచ్చిన సంక్షేమ పథకాలకు అర్హులవుతారన్నారు. పంట రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించాలని గ్రామీణ బ్యాంకులో గోల్డ్ లోన్ వడ్డీ రేటు తక్కువగా వుందని ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని చెల్లిస్తే తీసుకున్న అప్పు కంటే రెండు ఇంతలు ఎక్కువగా తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ త్రిలోకనాథ్ బాబు, మెసెంజర్ అశోక్, బ్యాంకు మిత్ర జయలక్ష్మి, రమాదేవి, ఖాతాదా రులు పాల్గొన్నారు.



ఖాతాదారులతో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

# వ్యక్తిగత విమర్శలు మానుకోండి

నల్లచెరువు జులై 18 ప్రభాత వార్త,

మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దశరథ నాయుడు నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి భర్త విజయనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఏదైనా ఉంటే రాజకీయంగా చూసుకోవాలని వ్యక్తిగత విమర్శలు చేసి మనోభావాలను దెబ్బతీస్తే. సరికాదని తెలి పారు. తాము ఎన్నికల సమయంలో పార్టీ గెలుపు కోసం అధిష్టానం నిర్ణయించిన నాయకుల కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేశామని అలాంటి మమ్మల్ని పార్టీ కార్యక్రమాలకు పిలవలేదనే ఆవేదనతో రాజకీయ విమర్శలు మాత్రమే చేశామని తెలిపారు. అయితే మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజకీయంగా కాకుండా వ్యక్తిగత విమర్శలు చేసి తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి వద్దకు కాళ్లభేరానికి వెళ్లి జడ్పిటిసి టికెట్ తెచ్చుకున్న మాట వాస్తవమేనని తెలిపారు. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే వయసులో పెద్దవారైన వారి కాళ్ళు పట్టుకుంటే తప్పు అని ప్రశ్నించారు. కదిరి ప్రాంతంలో తమకు సంబంధించిన భూమి నందు మరొక వ్యక్తికి పార్ట్నర్ ఉండడంతో ఫ్లెక్సీలను తొలగించాం అంతేకానీ పార్టీని భ్రష్ట పట్టించాలనో, పార్టీ మీద అభిమానం లేకనో కాదని గుర్తు చేశారు. ఇద్దరం కలిసి ఒకే పార్టీలో పని చేస్తూ అధిష్టానం నిర్ణయించిన నాయకుడి కోసం, పార్టీ గెలుపు కోసం పనిచేయలేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం తమ అనుభవిస్తున్న మండల కన్వీనర్ పదవి రాక మునుపు తమ మద్దతు కావాలని మా నివాసానికి వచ్చారా లేదా అని గుర్తు చేశారు. రాజకీయంగా వ్యక్తిగతంగా ఎన్నో విషయాల్లో తమరికి అండగా ఉన్నానో లేదో గుర్తు చేసుకోవాలని తెలి పారు. రూ.60 లక్షలు నగదు తీసుకున్నా నో లేదో సమన్వయ కర్తకే తెలుసుఅని అన్నారు. సొంత పార్టీలో ఒకరినొకరు దూషించుకుంటూ పోతే పార్టీకే నష్టమని వాపోయారు. పార్టీ పేరు వాడుకుంటూ వ్యక్తిగత విమర్శలు చేయడం ఇకనైనా మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో. గ్రామ సర్పంచ్ పంజరత్నమ్మ ఎంపీటీసీ లక్ష్మీదేవి.. ఉబిచర్ల సర్పంచ్ కుమారుడు షమీవుల్లా, ఎస్పీ మోనాలి, ముస్తఫా. లక్ష్మీపతి యాదవ్, కల్లిపల్లి శ్రీనివాసులు. ఎం ఆర్ అంజినప్ప, సూర్యనా రాయణ రెడ్డి, హనుమంతు రెడ్డి, నవాజ్. దొడ్డప్ప. ఉప సర్పంచ్ మధు. ఎల్లారెడ్డి, లక్ష్మీపతి రెడ్డి, పోలీస్ రెడ్డప్ప, ఖాదర్ వలీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బసి రెడ్డి విశ్వనాథరెడ్డి.

# వికె ఆదినారాయణరెడ్డికి ఘన నివాళి

యాడికి, జూలై 18 ప్రభాతవార్త

స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ,నిరంతరం పేదల పక్షాన పోరాడిన పోరాటయోధుడు కామ్రేడ్ వికె ఆదినారాయణరెడ్డి 28వ వర్ధంతిని శుక్రవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయ కులు వికె ప్రదీప్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్‌రఫీ, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరాముడుయాదవ్, జూటూరు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి గ్రామంలో జన్మి ంచిన వికె ఆదినారాయణరెడ్డి నిత్యం నిరుపేద బడుగు బలహీన వర్గాల కోసం పేద ప్రజల కూలి డబ్బులు కోసం పోరాటాలు చేస్తూ భూస్వాములకు ఎదురు తిరిగి అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించారన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమకు కృష్ణా జలాలు మళ్లించాలనే ఉద్దేశంతో ఆయన అనేక రూపాల్లో ప్రభుత్వం పైన పోరాటాలు చేసి సాధించారన్నారు. యాడికి కాలువకు కామ్రేడ్ వికె ఆదినారా యణ రెడ్డి పేరు పెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్య ంలో ప్రభుత్వానికి పంపాలని తీర్మానించారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళతా మన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఓబిరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు శ్రీరాములు, నీలూరు లక్ష్మయ్య, సంజీ వరెడ్డి, నారాయణరెడ్డి, విశ్వనా థరెడ్డి, పాపిరెడ్డి, జూటూరు బషీర్, గరిడి శివన్న, రామయ్య, వెంకటయ్య, చౌడప్ప, ఎల్అండ్‌టి రసూల్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, సిపిఐ పట్టణ కార్యదర్శి చిన్న కుళ్లాయిరెడ్డి, సిపిఐ యూత్ నా యకులు జూటూరు మహబూబ్‌రబ్బాని, నాయకులు వెంకటస్వామి, నారా యణ స్వామి కాలనీవాసులు. వెంగమ నాయుడు కాలనీవాసులు పాల్గొన్నారు.



వికె ఆదినారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## రికార్డులను పరిశీలించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

యాడికి, జూలై 18 ప్రభాతవార్త

యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాడికి-4 సచివాలయంకు సంబం ధించి 2023 నుండి 2025 వరకు గల రికార్డులను శుక్రవారం జి ల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యు లు పరిశీలించారు. గర్భవతులు, పిల్లల వైద్య సేవలు గురించి ఆన్‌లైన్ నమో దు ప్రక్రియను పరిశీలించారు. ఈ సమావేశంలో గర్భవతులు, చిన్నపిల్లల నమోదులో వున్నటువంటి లోపాలను ఆన్‌లైన్‌లో సరి చేసుకొనుటకు తగు సూచనలు సలహాలు అందిం చారు. అనంతరం ఏఎన్ఎం, ఎంఎల్‌హె చ్‌పిలను సమావేశపరిచి భవిష్య త్తులో తప్పులు జరగకుండా సకాలంలో గర్భవతులు, పిల్లల సేవలు ఆన్‌లైన్‌లో క్రమబ ద్ధీకరించుకోవాలని శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ శ్రీనివా స్‌రెడ్డి, డిపిఓ కిషోర్‌కుమార్, ఎంఐఎస్ విభాగం జరీనా, డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయిసుమంత్‌రెడ్డి, సిహెచ్‌ఓ జుబేదా, సూపర్‌వైజర్లు రాంప్రసా ద్‌గౌడ్, శోభకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

## కాంట్రాక్ట్ కార్మికులచే ఇంటింటి చెత్త సేకరణ

తాడిపత్రిటౌన్, జూలై 18 ప్రభాతవార్త

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో వున్న కారణంగా తాడిపత్రి పట్టణ ప్రజలు ఇబ్బంది పడకూ డదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే జె.సి.అశ్మిత్‌రెడ్డి, మున్సిప ల్‌చైర్మన్ జె.సి. ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ కాంట్రాక్ట్ కార్మికులను ఏర్పాటు చేసి ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. నందలపాడు ఏరియాలో కమీషనర్ శివరామకృష్ణ, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్ విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ షెక్షావలితో కలిసి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రజలందరూ గమనించి కార్మికులు నిరోధిక సమ్మె పూర్తయ్యే వరకు చెత్తను ఎక్కడపడితే అక్కడ బయట పడవేయకుండా రెండు రోజులకు ఒకసారి వచ్చే చెత్త వ్యానులో వేయాలని వారు ప్రజలకు సూచించారు.



పనులను పరిశీలిస్తున్న కమీషనర్ శివరామకృష్ణ

## అగాపే ఆశ్రమంలో అన్నదానం

యాడికి, జూలై 18 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో వున్న అగాపే ఆశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమలపాడు రాగుల కోటేశ్వర్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె సాతిరెడ్డి రేణుక, అల్లుడు ఆనంద్‌రెడ్డి, మనవడు నందీశ్వర్, మనవరాలు హరిణి కుటుంబసభ్యులు అగాపే ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదానం చేశారు. దీంతో ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా కామ్రేడ్ వికె ఆదినారాయణరెడ్డి వర్ధంతి

తాడిపత్రిటౌన్, జూలై 18 ప్రభాతవార్త

స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరం తరం పేదల కోసం శ్రమించిన కామ్రేడ్ వికె ఆదినారాయణరెడ్డి 28వ వర్ధంతిని శుక్రవారం సిపిఐ పార్టీ తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య ఆధ్వర్య ంలో రంగప్ప కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య మాట్లాడుతూ వి.కె ఆదినారాయణరెడ్డి నిరంతరం పేద ప్రజల కూలి డబ్బుల కోసం పోరాటాలు చేస్తూ భూస్వాములకు ఎదురు తిరిగి పోరాటాలు నిర్వహించారన్నారు. రాయలసీమకు కృష్ణా జలాలు మళ్లించాలనే ఉద్దేశంతో ఆనాడు అనేక రూపాల్లో ప్రభుత్వంపై పోరాటాలు చేశారన్నారు. ఈనాడు కృష్ణా జలాలు రాయలసీమకు వస్తున్నాయంటే అది వికె ఆలోచన విధానమే ఇందుకు మూలమన్నారు. వికె ఆశయాలు కొనసాగించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ తాడిపత్రి మండల కార్యదర్శి ఏ.నాగరంగయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు విటి రామాంజనేయులు, సిపిఐ పార్టీ తాడిపత్రి మండల సహాయ కార్యదర్శి ఏ.నారాయణరెడ్డి, మండల నాయకులు వీరప్ప, కృష్ణమాచారి, లోకు, నాగార్జున, బందు, తదితరులు పాల్గొన్నారు.



ఆదినారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## డ్రిప్ పరికరాలు చోరీ

యాడికి, జూలై 18 ప్రభాతవార్త

మండలంలోని పచ్చారు ేకలపల్లి గ్రామానికి చెందిన రైతు గొర్తి శ్రీనివాసులు పొలంలోని బిందు సేద్య పరికరాలను దుండగులు చోరీ చేశారు. దాదాపు 12 ఎకరాల్లో ఏర్పాటు చేసిన కొత్త బిందు సేద్య పరికరాలతోపాటు పాత డ్రిప్ పరికరాలను దొంగలు అపహరించారు. దీంతో దాదాపు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు చోరీలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుందని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# పరిహారం ఇచ్చి ఆదుకోండి

## - రోడ్డు విస్తరణలో భూమి కోల్పోతున్న రైతు ఆక్రందన

ఓబుళదేవరచెరువు, జూలై 18, ప్రభాతవార్త :

సంవత్సరానికి మూడు పరా య్యాయాలు పంటలు పండే భూములు, రెండు బోర్లు, పైప్ లైన్ ఇతర సామాగ్రి మొత్తం నాలుగు వరుసల రహదారి విస్తరణలో కోల్పోతున్నామని పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు వెంకటరమణ కుటుంబ సభ్యులు రోడ్డు విస్తరణ అధికారులను కోరారు. రైతు వెంకటమరణ ప్రభాతవార్త విలేకరితో మాట్లాడుతూ... నల్లమాడ మండలం పులగంపల్లి వద్ద ఉన్న తన పొలంలో రెండు బోర్ల ద్వారా వచ్చే నీటితో యేడాదిలో మూడు పంటలు పండిచుంకుంటున్నానన్నాడు. మొక్కజొన్న, టమేటా, వరితో పాటు పశుగ్రాసం సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నాడు. అయితే నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా తన పొలంలో కొంత భాగం వెల్లందిదన్నారు. అందులో రెండు బోర్లు, వృక్ష సంపద, పైప్‌లైన్‌లు ఉన్నాయన్నారు. కాగా వీటికి సంబంధించి ఇప్పటి వరకూ తనకు ప్రభుత్వం నుండి ఎటువంటి పరిహారం అందలేదన్నాడు. శుక్రవారం ఉన్నఫలంగా అధికారులు యంత్రాలతో వచ్చి తన పొలాన్ని ధ్వసం చేసి రోడ్డు పనులు ప్రారంభించడంతో తాము ప్రతిఘటించామన్నారు. కనీసం పరిహారం అందిన తరువాత పనులు చేపట్టండిని ప్రాదేయపడ్డా కనికరించకుండా కుటుంబ సభ్యులను అందరినీ ఓడీచెరువు పోలీస్ స్టేషన్‌కు తరలించారని వాపోయాడు. నాలుగు బోర్లు వేస్తే రెండింటిలో మాత్రం నీరు పడ్డాయని ఇప్పుడు బోర్లు వేసినా నీరు పడే అవకాశాలు లేవని పంటలను ఎలా కాపాడుకోవాలి దేవుడా అంటూ ఆక్రందించాడు. నీరు పడకపోతే నాకు చావే శరణ్యం అంటూ కుప్పకూలిపోయాడు. ఈ విషయమై నేషనల్ హైవే ఇంజనీర్ సుజిత, ఎన్ఎస్‌పిఆర్ సంస్థ ప్రతినిధి రాజేంద్రరెడ్డిలను వివరణ కోరగా ఈ ప్రాంతంలో ఇప్పటికే రోడ్డు పనులు చాలా ఆలస్యం అయిందని, రైతుకు తప్పకుండా పరిహారం అందుతుందన్నారు. బోర్లు, పైప్ లైన్ నిర్మాణానికి, ఇతర సామాగ్రికి రూ 7 లక్షలు రెండు రోజుల్లో అందే ఏర్పాటు చేస్తామని, అప్పటి వరకూ వ్యవసాయ బోర్లు తొలగించమని వివరించారు.



వ్యవసాయ పొలంలో రోడ్డు పనులు చేస్తున్న యంత్రాలు





పోలీస్ స్టేషన్ వెలుపల రైతు కుటుంబం ఆక్రందనలు

## డిపిఓపై జెసి వ్యాఖ్యలు అప్రజాస్వామికం

### - పంచాయితీ కార్యదర్శిల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వర్ల శంకర్ విమర్శ

అనంతపురం సిటీ, జూలై 18 ప్రభాతవార్త

జిల్లా పంచాయితీ అధికారిపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని రాష్ట్ర పంచాయితీ కార్యదర్శిల సమాఖ్య అధ్యక్షులు వర్ల శంకర్ ఖండించారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలోని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, డిపిఓ నాగరాజునాయుడుపై గురువారం చేసిన వ్యాఖ్యలు, ధూషణలను ఒక ప్రకటనలో ఆంధ్రప్రదేశ్ పంచాయితీ కార్యదర్శిల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వర్ల శంకర్ ఖండించారు. రాజకీయ నేతలు అధికారులతో సామర్స్య ధోరణిలో కాకుండా బెదిరింపు దోరణితో పరుష పదజాలంతో దూషించడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు స్వేచ్ఛా యుత వాతావరణంలో పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన సూచించారు.

## కామ్రేడ్ వికే.ఆదినారాయణ రెడ్డికి ఘననివాళులు

కూడేరు, జులై 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని విఙ్ఞేశ్వరకాలనీలో శనివారం స్వర్గీయ కామ్రేడ్ వికె ఆదినారాయణరెడ్డి 28వ వర్ధంతివేడుకలను ఘనంగా నిర్వహిం చారు. సిపిఐమండల కార్యదర్శి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ఇంటిస్థలాలు, సాగుభూములు తదితరులు వాటిపై పేదల పక్షాన నిలబడి ఎన్నో పోరాట ఉద్యమాలు చేపట్టారన్నారు.

## కుల్లాయి స్వామి హుండీ లెక్కింపు

నార్పల జులై 18, ప్రభాతవార్త నార్పల మండల కేంద్రంలోని గూగూడు గ్రామంలో గూగూడు కుల్లాయి స్వామి బ్రహోత్సవముల సందర్భంగా శ్రీ కుల్లాయిస్వామి దేవస్థానం తాత్కాలిక మరియు శాశ్వత హుండీలు లెక్కించగా 40,96,282 రూపాయలు ఆలయ ఈవో సాకేతపురం శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడు తూ.. గుగుడు కుళ్లాయ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయన్నారు. స్వామివారికి ముడుపులు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధికంగా వచ్చాయన్నారు. గత సంవత్సరం 37,27,719/లు రాగా, ఈ సంవత్సరం రూ. 40,96,842 వచ్చాయన్నారు. దాదా పు రూ. 3,68,563 /లు అధికంగా ముడుపులు వచ్చాయని తెలియ జేశా రు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలి యజేశారు.

# ఆర్డీటి ఎఫ్‌సిఆర్ఏను పునరుద్ధరించాలి - తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులు

ఓబుళదేవరచెరువు, జూలై 18, ప్రభాతవార్త : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆర్డీటి సంస్థ ఎఫ్‌సిఆర్ఏ లైసెన్సును పునరుద్ధరించాలని ఏపియుడబ్ల్యుజే యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జర్నలిస్టులు ఇన్‌చార్జ్ తహశీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ....ఆర్డీటి సంస్థ ఎంతో మంది నిరుపేదలకు విద్య, వైద్యం అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు పక్కా గృహాలను కట్టించి వారికి గూడును ఏర్పాటు చేసిందన్నారు. రైతు సంక్షేమానికి చెక్‌డ్యాంలు, వంతెనలు నిర్మించి గ్రామీణ ప్రాంత ప్రజలను అక్కున చేర్చుకుందన్నారు. ప్రభుత్వం చేయలేని మరెన్నో సేవకార్యక్రమాలను ఆర్డీటి సంస్థ చేసిందన్నారు. కోవిడ్-19 మహమ్మారితో బయపడుతున్న ప్రజలకు ఆర్డీడి సంస్థ మెరుగైన వైద్యసేవలు అందించిందన్నారు. జర్నలిస్టులకు సైతం నితా వ్యవసర సరకులు అందించి ఆదుకున్న చరిత్ర ఆర్డీటి సంస్థకు ఉందన్నారు. ఆర్డీటి సేవలు కొనసాగింపుకు కేంద్రం ప్రభుత్వం సహకరించి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజే మండల అధ్యక్షు, కార్యదర్శులు షేక్ షాజహాన్ బాష, యం రంగప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు వసంతం భుజంగరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బుద్దల గోపినాథ్‌రెడ్డి, కుంచెపు శ్రీనివాసులు, సీనియర్ జర్నలిస్టులు లక్ష్మన్న, ఫిరోజ్, పచ్చార్ల ఆంజనేయులు నాయుడు, మోమిన్ ఫయాజ్, కత్తి ఆనంద్, మురళి, మౌలాలి, మహబూబ్ బాష, నరసింహులు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.





తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

06ATP27_06ATP27.qxd 18-07-2025 PM 10:43 Page 1



# బంగారు కుటుంబాల సమీక్షకై నేటి నుంచి గ్రామసభలు

**-మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్**

**ఉరవకొండ, జూలై 18 ప్రభాతవార్త**



విలేఖరులతో మాట్లాడుతున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

ప్రభుత్వ,ప్రైవేటు ప్రజా భాగస్వామ్యం తో (పీ4) గుర్తించబడిన బంగారు కుటుంబాలను సమీక్షంచడానికిగాను ఈనెల 19వ తేదీ ఆగస్టు 5 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 19న బూదగవి, వెలిగొండ, 23న రాయంపల్లి, నెరమెట్ల, 24న వ్యాసాపురం, నింబగల్లు, 25న రేణిమాకులపల్లి, చిన్నముష్టూరు, 26న ఇంద్రావతి, పెద్దముష్టూరు, 29న మోపిడి, ఆమిద్యాల, 30 పెద్దకౌకుంట్ల, రాకెట్ల, 31న లత్తవరం, లత్తవరం తండా, ఆగస్టు 2న షేక్షానుపల్లి, 5న ఉరవకొండలో గ్రామసభలు జరుగుతాయన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా 2029 నాటికి గుర్తించబడిన బంగారు కుటుంబాలు అన్నింటినీ పేదరికం నుండి నిర్మాణాత్మకమైన, విస్తరింపచేయదగు నమూనా ద్వారా అభివృద్ధి చేయడానికి బంగారు కుటుంబాలను సమీక్షించి నిబంధనల మేరకు అర్హత కల్గిన కుటుంబాలను గుర్తించడానికి ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నాయని ఎంపీడీవో వివరించారు.

# జింకల మంద అడ్డు రావడంతో అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న కారు

**-రాయదుర్గం ఆర్టీసీ డిపోలో పనిచేసే కండక్టర్‌కు తీవ్ర గాయాలు**

**ఉరవకొండ, జూలై 18 ప్రభాతవార్త**



గుంతకల్లు ప్రధాన రహదారి పక్కన పీసీ ప్యాపిలి గ్రామ సమీపంలో చెట్టుకు ఢీకొన్న కారు

జింకల మంద అడ్డురావడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొనగా అందులో ప్రమాణిస్తున్న ఆర్టీసీ కండక్టర్ వై.సతీష్ తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున



తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ కండక్టరు వై.సతీష్

ఉరవకొండ– గుంతకల్లు ప్రధాన రహదారి లో పీసీ ప్యాపిలి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల దా ్వరా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే..గుత్తి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన వై.సతీష్ గుత్తిలో నివాసముంటూ రాయదుర్గం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణ నిమిత్తం ఆయన తన కారును నడుపుకొంటూ గుత్తి నుండి రాయదుర్గం బయలుదేరారు. ఈక్రమంలోనే ఆయన కారు శు క్రవారం తెల్లవారుజామున దాదాపు 2 గంటల ప్రాంతంలో పీసీ ప్యాపిలి గ్రామ సమీపంలోకి రాగానే జింకల మంద ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా రావడంతో వాటిని తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు ప్రక్కన వేప చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో చెట్టు విరిగిపోయి కారుమీద పడగా కారు ధ్వంసమై ప్రమాదంలో వై.సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకొని అతన్ని చికిత్సకై ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అతన్ని మెరుగైన చికిత్సకై వైద్యుల సూచనల మేరకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు.

# గుత్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా ప్రతాప్‌నాయుడు

**గుత్తి, జూలై 18 ప్రభాతవార్త**



గుత్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రతాప్‌నాయుడు (ఫైల్‌ఫోటో)

గుత్తి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన గుర్రాల సూర్యప్రతాప్‌నాయుడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 66 వ్యవసాయ మార్కెట్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ యువత విభాగం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను గుత్తి మార్కెట్‌యార్డ్‌చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు ప్రతాప్‌నాయుడు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం ఆదేశాల మేరకు రైతుల సంక్షేమానికి పాటుపడుతానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను అభినందనలు తెలిపారు.

# 5 ఏళ్ల అభివృద్ధి...తొలి ఏడాదిలోనే సాధించాం

**-డోర్ టు డోర్ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి**



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి

**గోరంట్ల, జూలై 18 ప్రభాతవార్త**

గడపగడపకు సంక్షేమ పథకాలు అందాలంటే అది కూటమి ప్రభుత్వం సుపరిపాలనతోనే సాధ్యమని గోరంట్ల మండలం మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని 1వవార్డు చౌడేశ్వరికాలనీలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యాధరణితో పాటు నాగమణి, వార్డు మెంబర్లు లక్ష్మీనాగరాజు, రామచంద్ర, బూత్ కన్వీనర్ మునిస్వామి, భరత్, మాజీ వార్డు మెంబర్ సుధాకర, గిద్దలూరి రామ్మోహన్, తదితరుల నేతృతంలో నేత కార్మికులు నివాసముండే చౌడేశ్వరికాలనీలో ఇంటింటి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వ పాలన గురించి ప్రజలకు వివరించారు. అర్హత వున్న ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందాలన్న, మారుమూల గ్రామంలో అభివృద్ధి జరగాలన్న కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నిమ్మల విద్యాధరణి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుంటిపల్లి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# శుద్ధ జల నీరు సిద్ధం.. గ్రామాలకు మంచి నీటి సరఫరా

**- మదర్‌ప్లాంట్‌ను మరమ్మత్తు చేయించి ప్రారంభించిన ఎంపిపి**

**అగళి, జులై 18 ప్రభాతవార్త**



నీటిని గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా పంపుతున్న దృశ్యం

అగళి సంత మార్కెట్‌లో ఉన్న మధర్‌ప్లాంట్ సాంకేతిక సమస్యలతో గత 15రోజులుగా గ్రామాలకు శుద్ధ జలం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత వారం రోజులుగా ఎంపిపి రేణుకా కామరాజు, జడ్పిటిసి ఉమేష్ తదితరులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని రెండు బోర్లు తవ్వించడంతోపాటు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. నీటిని శుద్ధి చేసే మెమోరి పాడవడంతో దాన్ని రూ.5లక్షలు పెట్టి అమర్చారు. ఇంకా సాంకేతిక సమస్యలు ఉన్నవాటిని సత్వరమే పరిష్కరించి గ్రామాలకు శుద్ధ నీటిని శుక్రవారం నుంచి సరఫరా చేస్తున్నారు. అందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ శుద్ధనీటిని సరఫరా చేసే కార్యక్రమంలో కన్వీనర్ తిప్పేస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కొల్హాపురి మహాలక్ష్మికి విశేష పూజలు

**అగళి, జులై 18 ప్రభాతవార్త**



కొల్హాపురి మహాలక్ష్మిని అలంకరించిన దృశ్యం

ఆషాఢ మాసంలో ప్రత్యేకంగా మహిళా దేవతలను విశేషంగా పూజించడం ఆనవాయితీ. అందులో పురస్కరించుకుని అమ్మవారికి ప్రీతికరమైన రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్హాపురి మహాలక్ష్మిని వివిధ రకాల పూలతోపాటు, నిమ్మకాయలతో అలంకరించారు. మహిళా భక్తులు ఆషాఢ శుక్రవారం పురస్కరించుకుని ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దేవికి ప్రత్యేకంగా హారతులను పట్టారు. మహా మంగళహారతి అనంతరం ఆలయ మండలి వారు భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

# అంగన్వాడీ కేంద్రాలు, యాప్‌ల నిర్వహణలో అలసత్వం వహించవద్దు

**బత్తలపల్లి, జూలై 18 ప్రభాతవార్త**



ప్రాజెక్టు మీటింగ్ లో మాట్లాడుతున్న సిడిపిఓ సరస్వతి



వినతి పత్రం అందజేస్తున్న మృతి చెందిన వాసంతి కుటుంబ సభ్యులు

గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌ల నిర్వహణలో అలసత్వం వహించవద్దని సిడిపిఓ సరస్వతి కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రాజెక్ట్ మీటింగ్లో ఎఫ్ ఆర్ ఎస్, ఆధార్, ఫుడ్ రిసీవ్స్, పోషణ ట్రాకర్ యాప్‌ల గురించి వివరించామన్నారు. అంగన్వాడి సెంటర్స్ సమయ పాలన పాటించాలని, ప్రతి ఒక్కరూ యూనిఫాంలోనే ఉండాలని తెలియజేశారు. ప్రతి సెంటర్లో కూడా కచ్చితంగా ప్రీస్కూల్ యాక్టివిటీస్ చేయాలని తెలియజేశామన్నారు. ప్రాజెక్ట్ కార్యదర్శి, ఎర్రాయిపల్లి అంగన్వాడి కార్యకర్త అయిన వాసంతి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా, ఆమె మృతికి రెండు నిమిషాల పాటు మోనం పాటించామన్నారు. అదేవిధంగా వాసంతి మృతితో ఖాళీ అయిన ఎర్రాయపల్లి అంగన్వాడీ పోస్టును తన కూతురికి ఇవ్వాలని మృతి చెందిన వాసంతి భర్త నారాయణస్వామి అర్జీ ఇచ్చినట్లు సిడిపిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు చంద్రమ్మ, ఎర్రమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ ఓబులమ్మ అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

# 21న మడకశిరకు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత రాక..

**సుపరిపాలన తొలి అడుగుకు హాజరు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి..**

**మడకశిర టౌన్ జులై 18, ప్రభాతవార్త,**

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఇదే నెల21న సోమవారం మడకశిరకు రాష్ట్ర హెం శాఖ మంత్రి వంగల పూడి అనిత వస్తున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ: 21న మడకశిర పట్టణంలో నిర్వహిం చనున్న సుపరి పాలన తొలి అడుగు కార్యక్ర మానికి హోం శాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.హోం మంత్రి కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు పట్ల స్థానిక నాయకులతో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు చర్చించారు..

# మున్సిపల్ కార్మికుల సమ్మెకు వైకాపా మద్దతు



కార్మికుల సమ్మెకు మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దతు తెలుపుతున్న దృశ్యం

**గుత్తి, జూలై 18 ప్రభాతవార్త**

తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న సమ్మెకు శుక్రవారం వైకాపా పార్టీ నాయకులు తమ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపచేయాలని, జిఒ నెంబర్ 36ను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూరుబీ, పార్టీ కన్వీనర్లు మధుసూదన్‌రెడ్డి, గంగరాజు, షఫీ, కౌన్సిలర్లు వరదరాజులు, రమణ, నరేష్, సర్పంచు చిన్న ఆంజనేయులు, గురుప్రసాద్‌యాదవ్, రమేష్‌రెడ్డి, జీపు రమణ, మల్లికార్జున, అబ్దుల్, వెల్డింగ్ రౌఫ్, శ్రీనివాసయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం లారీని పట్టిన విజిలెన్స్ అధికారులు

**430 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం**

**మడకశిర టౌన్ జూలై 18 ప్రభాతవార్త**



విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న దృశ్యం

పట్టణంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు పావగడ నుండి తుమకూరు జిల్లాకు ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 430 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. మడకశిర పట్టణంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. లారీతో పాటు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ ఐ,జమాల్ బాష తెలిపారు.

# వైసిపి మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వైసి అరవింద్ రెడ్డి నియామకం

**తాడిమర్రి జులై 18(ప్రభాతవార్త)**



ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఎన్నికైన వైసి అరవింద్ రెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా దాడి తోట గ్రామానికి చెందిన వైసి అరవింద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు అందాయి.పార్టీ కార్యక్రమాల్లో దూసుకు వెళ్తూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన వైసీ అరవింద్ రెడ్డి ని పార్టీ అధిష్టానం గుర్తించి కీలకమైన ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అరవింద రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేసిన తమను పార్టీ గుర్తించి మండల కమిటీలో సముచితస్థానం కల్పించినందుకు పార్టీకి ఎల్లవేళలా రుణపడి ఉంటానని అందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి డిసిఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డికి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్ రెడ్డికి మరియు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీనాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. నాయకులు కార్యకర్తల సహయ సహకారాలతో మండలంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని వచ్చే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# పరిటాల శ్రీరామ్ కృషి వల్లే సుపరిపాలనలో తొలి అడుగు, విజయవంతం

**ధర్మవరం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు ముసుగు శ్రీనివాసులు**

**తాడిమర్రి జూలై 18 (ప్రభాతవార్త)**



ముసుగు శ్రీనివాసులు

ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ యువ నాయకులు పరిటాల శ్రీరామ్ కృషి పట్టుదల వల్లే నియోజకవర్గంలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం విజయవంతంగా సాగుతూ సత్యసాయి జిల్లాలోనే ధర్మవరం నియోజకవర్గం మొదటి స్థానం సాధించిందని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముసుగు శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఛాలెంజ్ గా తీసుకొని ఎప్పటికప్పుడు నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించేందుకు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. యువ నాయకులు పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు క్రమశిక్షణతో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం జరుగుతోందని అన్నారు.

# ద్విచక్ర వాహనం నుండి పడి యువకుడు మృతి

**బత్తలపల్లి, జూలై 18 ప్రభాతవార్త**

ద్విచక్ర వాహనం లో వెళ్తున్న యువ కుడు అదుపుతప్పి కింద పడి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డి. చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ తన కుటుంబంతో కలిసి బెంగుళూరులో నివాసం ఉంటున్నాడు. గ్రామంలో మొహరం పండుగ జరుగుతున్న సందర్భంగా స్వగ్రామానికి ఆదినారాయణ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చినట్లు తెలిపారు. ఈనెల 6న ఆదినారాయణ కుమారుడు గురు ప్రసాద్(25) పనిమీద కట్ట కింద పల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్లారన్నారు. అక్కడనుండి తిరిగి వస్తూ వేగాన్ని అదుపు చేయలేక అదుపుతప్పి రోడ్డు పక్కన గాయాలతో పడి ఉండగా కుటుంబ సభ్యులు ఆర్డిటి ఆస్పత్రిలో చేర్పించారన్నారు. అక్కడనుండి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి ఆపై బెంగుళూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఆదినారాయణ ఫిర్యాదు చేశాడన్నారు. ఆదినారాయణ ఇచ్చిన పిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# సీపీఐ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయండి...!

**ధర్మవరం, జూలై 18(ప్రభాతవార్త)**

ధర్మవరం పట్టణంలో ఈ నెల 31న జరిగే సీపీఐ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కాటమయ్యలు పిలుపు నిచ్చారు. ఈ మేరకుస్థానిక ఎన్జీఒహోంలో శుక్రవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ... సత్యసాయి జిల్లాలో చాలా వెనుకబడిన జిల్లా అని, కరువు కోరల్లో చిక్కుకుని నిత్యం నలిగిపోతోం దదన్నారు. జిల్లాలో ఎక్కడ చూసిన ఆత్మహత్యలు, వలసలు జరుగుతున్నాయన్నారు. జిల్లా అభివృద్ధి కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాల రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమదు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జింకాచలపతి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జాన్సన్బాబు, పట్టణ కార్యదర్శి పూలశెట్టిరవికుమార్,పట్టణ సహాయకార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మికసంఘం జిల్లా ప్రదానకార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటస్వామి,చెన్నంపల్లి శ్రీనివాసులు,రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కాటమయ్య తదితరులుపాల్గొన్నారు.



జిల్లా మమహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

# 6వ రోజుకు చేరుకున్న ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

**పుట్టపర్తి టౌన్, జూలై 18, ప్రభాతవార్త**

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 6వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ముందు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. వీరి నిరసనకు పారిశుద్ధ్య కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గం అన్నారు. మేము న్యాయమైన సమస్యలపైనే పోరాడుతున్నామని ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో సమ్మె కొనసాగుతుందని, మరింత ఉధృతంగా ఆందోళన చేస్తామని ఆయన పేర్కొన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికులను, అలాగే పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ, గణేష్, సాయి, సద్దాం హుస్సేన్, రమేష్, రామదాసు, సాయినాథ్ రెడ్డి, పారిశుధ్య కార్మికుల నాయకులు నాగార్జున, పెద్దన్న, రామయ్య, నరసింహులు, గోవిందు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు జగన్‌కు అనుసంధానంగా కమిటీలు

**త్వరలో ఇంటింటికి బాబు షూరిటీ మోసం గ్యారంటీ**

**రాష్ట్ర వైకాపా ఆర్గనైజేషన్ అక్రివిటీ కార్యదర్శి వజ్రభాస్కర్ రెడ్డి**



వైకాపా నాయకులు దృశ్యం

**అమరాపురం జులై 18 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వీరశైవ కళ్యాణ మండపం నందు బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం పై వైకాపా నాయకులు ,కార్యకర్తలతో సమావేశాన్ని శుక్రవారం నియోజకవర్గ సమన్వయ కర్త ఈర లక్కప్ప ఆధ్వర్యంలోవైకాపా మండల అధ్యక్షుడు త్రీ లోక్నాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైకాపా ఆర్గనైజేషన్ అక్రివిటీకార్యదర్శి వజ్రభాస్కర్ రెడ్డి, రాష్ట్ర వైకాపా మహిళా ప్రతినిధి మధులత, మాజీమంత్రి నరసేగౌడ్, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి వాగేష్,రాష్ట్ర బీసీ సెల్ వైకాపా ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, రాష్ట్ర ఒక్కలిగా వైకాపా అధ్యక్షుడు రంగగౌడ్, జడ్పిటిసిలు అనంతరాజు, భూతరాజు, అమరాపురం ఎంపీపీ కెం కెర ఈరన్న, జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ వైకాపాఅధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్ర భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు జగన్ కు అనుసంధానంగా కమిటీలను రాష్ట్రంలోనే మడకశిర నియోజకవర్గాన్ని మోడల్ ప్రాజెక్టుకమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఈనెల 22 నుండి 31 లోపు నియోజకవర్గ వ్యాప్తంగా మోడల్ ప్రాజెక్టు గ్రామస్థాయి కమిటీలనుపూర్తి చేయాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి బాబు సూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటింటికి తీసుకెళ్లే కార్యక్రమాన్ని త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగాచేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు హెచ్ బి నరసేగౌడ్, వాగేష్, హాలుకూరు కాంతరాజ్, అనంత రాజ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింహమూర్తి, అమరాపురం ఎంపీపీ ఈరన్న తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కోసం జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను నవరత్రాల పథకం ద్వారా ప్రతి ఇంటికి అందించి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమం నందు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు శివకుమార్, మాజీ డైరెక్టర్లు వీర కేతరాయప, వైస్ ఎంపీపీలు కృష్ణమూర్తి, రంజిత్,గగన, ఐటీ వింగ్ చిత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ నటరాజ్, ఎంపీటీసీలు నాగభూషణ్, ధనుంజయ,హనుమంతరాయ, నారాయణ గౌడ్, కించప్ప, సర్పంచులు జితేంద్ర,, చిత్తన్న, నరసింహమూర్తి, సదానంద గౌడ్, ఈరన్న, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్, మాజీడీలర్ రంగనాథ్, బీడీ మూర్తి, సీనియర్ నాయకులు పేలుబండ ప్రసాద్ ,ఏ .నారాయణ, తిప్పేస్వామి, జెకె మూర్తి, ఎంజారప్ప, నాగేంద్రప్ప, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు రామ్మూర్తి, మంజునాథ్, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, దివాకర్, మంజునాథ్ మైనార్టీ నాయకులుతదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కందులు పంపిణీ

**గుడిబండ జులై 18 ప్రభాతవార్త**



రైతులకు కందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మండల కేంద్రం లోని రైతు సేవా కేంద్రంలో అర్హులైన రైతులకు ఉచితంగా కందులు, రాగుల మినీ కిట్లను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని సచివాలయాలలో రైతు సేవా కేంద్రాల ద్వారా ఉచితంగా కందులను పంపిణీ చేయడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ పంపిణీ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్,ఎంపీటీసీ వనజాశశిధర్, తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తి, జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్, లాయర్ శివకుమార్, సింగల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, క్లస్టర్ ఇంచార్జ భీమరాజు, మైనార్టీ నాయకుడు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలోనిలో డ్రైనేజ్ పనులు ప్రారంభం

**అమలాపురం జులై 18 ప్రభాతవార్త**



డ్రైనేజ్ పనులునిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలో ఆలదపల్లి గ్రామం నందు డ్రైనేజ్ పనులు అమరాపురం జడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తిలు శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు నాన్న ఇబ్బందులు పడేవారని దీన్ని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల దృష్టికి తీసుకెళ్లడంతో డ్రైనేజ్ నిర్మాణానికి ఎస్సీ కాలనీలో పనులు ప్రారంభించినట్లు జడ్పిటిసి తెలిపారు. ఈ సందర్భంగా కాలోని ప్రజలు స్థానిక తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# నిమ్మకాయల అలంకారంలో పెద్దమ్మతల్లి.

**ధర్మవరం, జూలై 18(ప్రభాతవార్త)**



పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మతల్లి నిమ్మకాయల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో అర్చకులు వెంకటేశ్ శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిమ్మకాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి బుగ్గవంశస్తులు ఉభయదాతలుగా వ్యవహరించారు. మహిళలు లలితా సహస్ర నామ పారాయణంచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శిం చుకున్నారు.

# ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై విస్తృత ప్రచారం

### -సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న విద్యుత్‌శాఖ



ఉరవకొండలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనపై ప్రచారం నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు

**ఉరవకొండ, జూలై 18 ప్రభాతవార్త**

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై విద్యుత్‌శాఖ అధికారులు ఉరవకొండ ప్రాంతంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్, ఏఈ గురుమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక వాహనానికి మైకును ఏర్పాటు చేసి బ్యానర్లు చేతబట్టి పట్టణ ప్రధాన వీధుల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏడీ భాస్కర్, ఏఈ గురుమూర్తి మాట్లాడుతూ గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లు తగ్గించుకోవడానికి ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని సూచించారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చదరపు మీటరు/100 చదరపు అడుగుల స్థలంలో 1కేడబ్ల్యూపీ సామర్థ్యం కల్గిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకు బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. పిఎంసూర్యఘర్.జిఒవి.ఇన్/ఎపిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్ ద్వారా పిఎంసూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకై, విద్యుత్ సమస్యల పరిష్కారానికిగాను టోల్‌ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయాలని సూచించారు.

# క్షయ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం

### -ఆర్టీసీ డిపోలో టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

**ఉరవకొండ, జూలై 18 ప్రభాతవార్త**



టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న డిపో మేనేజర్ హంపన్న, ఆరోగ్య సిబ్బంది తదితరులు

క్షయ రహిత సమాజాన్ని నిర్మించడంలో అందరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జరుగగా డిపో మేనేజర్ హంపన్న అధ్యక్షత వహించగా ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి.బి సూపర్‌వైజర్ కుళ్లాయమ్మ మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా క్షయ వ్యాధి వ్యాప్తిని నిరోధించవచ్చని, మరణాలను తగ్గించవచ్చని అన్నారు. 2027 నాటికి దేశంలో క్షయ వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. 2 వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు పట్టడం, హెమోప్టిసిస్, ఛాతీ నొప్పి, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట, మెడలో వాపు, ఇతర అదనపు ఊపిరితిత్తుల సంకేతాలు ఉంటాయన్నారు. క్షయ వ్యాధి 60 సంవత్సరాల వయసు ఉన్నవారికి, పోషకాహార లోపం, మధుమేహ, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు, ధూమపానం, మద్యంపానం చేసేవారికి సోకే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. ఏదేని లక్షణాలను గుర్తించినట్లయితే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, పట్టణ ఆరోగ్య కార్యకర్తలు వెంకటేష్, ప్రసాద్‌రావు, సుమలత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

# 24న ఉరగాద్రిలో చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు

### -ఆలయ ధర్మకర్త శరత్ ఆధ్వర్యంలో పోస్టర్ల విడుదల

**ఉరవకొండ, జూలై 18 ప్రభాతవార్త**



చౌడేశ్వరి జయంతి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ ధర్మకర్త కొత్త శరత్ తదితరులు

ఉరవకొండ పట్టణంలోని ప్రసిద్ధ ఉరగాద్రి రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 24వ తేదీన స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం ఆషాడ అమావాస్య గురువారం చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త కొత్త శరత్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులతో కలిసి జయంతోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొత్త శరత్ మాట్లాడుతూ జయంతిరోజు ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు, మహామంగళహారతి కార్యక్రమాలు, మధ్యాన్నం 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 6.30గంటలకు అమ్మవారిపల్లకీసేవ కార్యక్రమాలు కొనసాగుతాయని వివరించారు. భక్తులు పెద్దఎత్తునతరలివచ్చి జయంతోత్సవంలోపాల్గొని జయప్రదం చేయాలనికోరారు. ఈకార్యక్రమంలో రెడ్డి ఆంజనేయులు, చిట్టారఘు, లక్కఎర్రిస్వామి, కొత్త భాస్కర్, ఉట్టి నారాయణ స్వామి, ఉట్టి ధనుంజయ, పోసా రామన్న, లచ్చి, ఆర్.సి.ప్రసాద్, నిమ్మల ప్రసాద్, చంగల కిషోర్, ఆలయ పూజారి ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లండి

**గుత్తి, జూలై 18 ప్రభాతవార్త**



రాయలసీమ వైకాపా ఇన్‌చార్జ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ ఇన్‌చార్జ్ వేంపల్లి సతీష్‌రెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని శుక్రవారం గుత్తికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వం పట్ల ప్రజల్లో వున్న వ్యతిరేకతను ప్రచారం చేయాలని వారు నాయకులకు సూచించారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైకాపా జెండాను ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం రాయలసీమ ఇన్‌చార్జ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేను వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి సి.వి.రంగారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి బ్రహ్మకుమార్, సీనియర్ నాయకులు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

### పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

**గుడిబండ జూలై 18 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఎస్ రాయాపురం గ్రామానికి చెందిన డీలర్ భూతరాజు ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం తన పొలంలోకి వెళ్లి వస్తుండగా అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేయడంతో భూతరాజు తీవ్రంగా గాయపడ్డాడు.హుటాహుటిన అతనిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి భూతరాజును పరామర్శించారు.భూతరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి పంపించారు.



భూతరాజును పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్సీ గుండుమల

# ప్రజలకు మంచి సంక్షేమాలు అందించాం

**అగళి, జూలై 18 ప్రభాతవార్త**



ప్రజలకు సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను అందజేస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ కరపత్రాల రూపంలో తెలియజేయాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి చేసిన పనులను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా వృద్ధులకు, దివ్యాంగులకు రూ.1000 పెంచామని, అదే వైఎస్ఆర్‌సిపి వారు వెయ్యి పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసి సబ్సిడిని మహిళల ఖాతాల్లో జమా చేశామని, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి 13000 ప్రకారం తల్లుల ఖాతాల్లోకి జమా చేశామని, అదే వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇంట్లో ఐదు మంది పిల్లలు ఉంటే ఒక్క విద్యార్థికి మాత్రమే 13వేల ప్రకారం జమా చేశారన్నారు. అన్నదాత సుఖీభవ కింద సత్వరమే ఒక్కో రైతుకు పిఎం కిసాన్ డబ్బులతో కలిసి మూడు విడతలుగా 20వేలు అందజేయడానికి జాబితా సిద్ధం చేశారని అదే వైఎస్ఆర్‌సిపివారు కేంద్ర నిధులతో కలిసి 13500 మాత్రమే అందించాని గుర్తు చేశారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చిన్నారులకు పాఠశాలలు తెరిచిన వెంటనే యూనిఫాంతోపాటు టెక్స్ పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బ్యాగులు, షూలు అందించడంతోపాటు మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం అందించడంతో విద్యార్థులు తృప్తిగా తింటున్నారని, అదే వైసిపి ప్రభుత్వంలో అన్నం ముద్దగా అయ్యేవని విద్యార్థులు తినకుండేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రేణుకా కామరాజు, జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ తిప్పేస్వామి, డీలర్లు రాజన్న, బసవరాజు, సిగనాగప్ప, శఫి, పవన్‌తోపాటు రఘు, గోవిందప్ప, శివన్న, రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# డి. చెర్లోపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరం

**బత్తలపల్లి, జూలై 18 ప్రభాతవార్త**



గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గ్రామంలో మురికి ప్రదేశాలను పరిశీలిస్తున్న దృశ్యం

మండలంలోని డి. చెర్లోపల్లి గ్రామం లో ప్రాథమిక కేంద్ర వైద్యాధికారి డాక్టర్ విష్ణువర్ధన్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఎస్టి కాలనీలో గత రెండు రోజులుగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం గ్రామంలో అపరిశుభ్రత వల్ల జ్వరాలు ప్రభలే అవకాశం ఉన్నందున గత రెండు రోజులుగా వైరల్ ఫీవర్స్ రానుండడంతో గ్రామంలో ఉచిత వైద్య శిబిరము తో పాటు ఇంటింటా లార్వా సర్వే, ఫీవర్ సర్వే నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించు మలేరియా, డెంగ్యూ,వైరల్ ఫీవర్స్ గురించి, పరిసరాల పరిశుభ్రత,ఫ్రైడే ఫ్రైడే ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. దోమల నియంత్రణ చర్యలో భాగంగా సచివాలయ సెక్రటరీ ఆధ్వర్యంలో కాలవలు శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. దోమల లార్వా నియంత్రణలో భాగంగా కాలువలో అబేట్ అనే మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ విష్ణువర్ధన్,సూపర్వైజర్ అశ్వర్థ నారాయణ, ఆరోగ్య కార్యకర్తలు డేవిడ్, గంగాదేవి, హెల్త్ ప్రొవైడర్ శ్రీదేవి, సచివాలయ సెక్రటరీ నారాయణస్వామి, మహిళా పోలీసు గురుదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ వితరణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాదవి

**బత్తలపల్లి, జులై 18 ప్రభాతవార్త**

విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1000 లీటర్ల సామర్థం కలిగినఆర్వో వాటర్ ప్లాంట్ను వితరణగా అందజేశారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలకు రూ.1.70లక్ష కార్పోరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటి కింద సీసీఎల్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ హైదరాబాద్ వారు సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెయ్యి లీటర్లు సామర్థం ఉన్న ఆర్వో వాటర్ ప్లాంటు అందజేశారు. శుక్రవారం ఆర్వో వాటర్ ప్లాంట్ను ప్రారంభించేందుకు ముఖ్యఅతిథిగా సాహితీ గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాధి జె. ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ జిల్లాలో అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌళిక సదుపాయాలు కల్పించడంలో ఎంతో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాదవి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో గర్భవతులకు భోజన సౌకర్యం

**గుత్తి, జూలై 18 ప్రభాతవార్త**



గర్భవతులకు భోజనం అందిస్తున్న దృశ్యం

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఎమ్మెల్యే జయరాం తల్లి శారద, సోదరుడి భార్య త్రివేణిల జ్ఞాపకార్థం గత సంవత్సరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కిరణ్‌చౌదరి ఆధ్వర్యంలో మహిళలకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప, జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్ రాయల్, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోండి

### జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి(కలెక్టరేట్), జూలై 18, ప్రభాతవార్త**

జనవరి 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్వో విజయసారధితో కలసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ మాట్లాడుతూ..2026 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. అదే సమయంలో, మృతి చెందిన వ్యక్తులు, గ్రామం వదిలి శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఒకే వ్యక్తి పేరు రెండు సార్లు నమోదు అయిన వారి పేర్లు ఓటర్ జాబితా నుండి తొలగించబడతాయన్నారు. అలాగే ఓటర్ల పేర్లు, వయస్సు లేదా ఇతర వివరాల్లో పొరపాట్లు జరిగి ఉన్న ఉన్నవారికి ఓటరు సవరణ అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తుందన్నారు. ఈ పనుల నిర్వహణ కోసం మొత్తం 1576 మంది బూత్ లెవెల్ అధికారులను నియమించామన్నారు. ఒక్కో నియోజక వర్గం వారిగా ఒకరిని ఎంపిక చేసి మొత్తం ఆరు నియోజకవర్గాలకు ఆరు మంది బిఎల్వోలను ఎంపిక చేసి ఢిల్లీలో వారికి తగిన శిక్షణ ఇచ్చారన్నారు. ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల మార్పులు వంటి అంశాలపై నియోజకవర్గాల్లో మీ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నారు. .సంబంధిత అధికారులు నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తూ.. ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా వెళ్లి అర్హులైన ఓటర్లను నమోదు చేస్తున్నారన్నారు. ఓటర్ల జాబితాలో ఏవైనా మార్పులు, సవరణలు అవసరమైతే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేయవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నుండి సామకోటి ఆదినారాయణ, బిజెపి నుండి భరత్ కుమార్, వైసిపి నుండి రవినాయక్, జె ఎస్ పి నుండి సతీష్ కుమార్, బి ఎస్ పి నుండి నాగరాజు ఎలక్షన్ సెల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం...!



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

**ధర్మవరం, జూలై 18(ప్రభాతవార్త)**

కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం సుభీక్షంగా ఉంటుం దని టీడీపీ నాయకులు బొట్టుకిష్ట తెలిపారు. శుక్రవారం కేతిరెడ్డికాలనీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు బొట్టుకిష్ట,రవి, తిరుపాల్, సీబీఎన్ రామకృష్ణ, బొట్టుశీన, ఓబుళపతి, వెంకటనారాయణ, సూరి,సత్తి, ఆనందరెడ్డిలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అందిస్తున్నపథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగితెలుసుకున్నారు. వార్డులో సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకున్నారు. టీడీపీ అదికారంలో ఉంటేనే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గం కూడా పరిటాలశ్రీరామ్ ఆధ్వర్వంలో అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తాందన్నారు.

# మహిళలకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం



మహిళలకు క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**బత్తలపల్లి, జూలై 18 ప్రభాతవార్త**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆర్డిటి వారి సహకారంతో మహిళలకు క్యాన్సర్ పై అవ గాహన, ఉచిత సెర్వేక్స్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు గోవర్ధన్‌నాయుడు, డాక్టర్అరుణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆర్‌డిటి సహకారం తో దాదాపు 30మంది మహిళలకు ఉచితసెర్విక్స్‌క్యాన్సర్ పరీక్షలు నిర్వ హించారు. క్యాన్సర్ ముందస్తు నివారణకు అవసరమైన హెచ్పీవీ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డిటి వైద్య సిబ్బంది . డాక్టర్ జ్యోతి, డాక్టర్స్ సుప్రజ, డాక్టర్ శిరీషలు ఉచిత సర్విక్స్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్పిలు, ఫార్మసిస్ట్, లాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

# బొలెరో వ్యాన్ బోల్తా డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



బోల్తా పడిన బొలెరో వ్యాన్

**కనగానపల్లి జూలై 18 ప్రభాతవార్త**

మండలంలోని గుంతపల్లి గ్రామానికిచెందిన బోయ గోపాల్ ఆయన నడుపుతున్న బొలెరో వ్యాన్‌అదుపుతప్పి బోల్తా పడ డంతో ఆయన తలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, బంధువుల వివరాల మేరకు అనంతపురం నుండి గుంతపల్లి గ్రామానికిబయలుదేరిన బొలెరోవాహనం శుక్రవారంమధ్యాహ్నం చెన్నమనా యునికోట గ్రామం పీఏబీఆర్ కాలవ దగ్గరలో రోడ్డు మలుపు వద్ద వేగం గా వెళ్లడంతో అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న గుంతల్లోకి పోయి బోల్తా పడింది. ఈ ఘటన లో డ్రైవర్ బోయ గోపాల్ తలకు స్వల్ప గాయాలు అయ్యాయి. గోపాల్ ను అనంతపురం ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు.

# పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు

**కళ్యాణదుర్గం టౌన్ , జూలై 18, ప్రభాతవార్త**

అనంతపురం జిల్లాఎస్పీ జగదీష్ ఆదేశాలమేరకు కళ్యాణదుర్గం పట్టణంలోని ముదిగల్లు రోడ్డులో శుక్రవా రం ఆర్‌డిటి ఫీల్డ్‌ఆఫీసు నందు అనంతపురం నుండి వచ్చిన వైద్య సిబ్బందిచే కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుత జీవనశైలిలో ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించి, తరచుగా సంబంధిత ఆరోగ్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్త వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం డిఎస్పి రవికుమార్, కళ్యాణదుర్గం పట్టణ సిఐ యువరాజు, రూరల్ సీఐ వంశీకృష్ణ సబ్ డివిజన్ లోని ఎస్ఐలు, సుమారు 250 పోలీసు సిబ్బంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



# హంద్రీనీవా పనులు వేగవంతం చేయండి...

### జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

**పుట్టపర్తి, జూలై 18, ప్రభాతవార్త**



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో హెచ్ ఎన్ ఎస్ ఎస్ పనులపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ హెచ్ఎన్ఎస్ఎస్ పనులు మూడు ఏజెన్సీలకు అప్పగించడం జరిగిందని అన్నారు.216 కిలోమీటర్ నుండి 340 కిలోమీటర్ వరకు ఆర్ వి ఆర్ ఏజెన్సీకి , 340 కిలోమీటర్ నుండి 400/ 500 కిలోమీటర్ వరకు బి ఎస్ ఆర్ ఏజెన్సీకి, 0/0 కిలోమీటర్ నుండి 75 కిలోమీటర్ వరకు పిబీసీ(పుంగనూరు బ్రాంచ్‌కెనాల్) ఎస్సార్‌కన్స్‌స్ట్రక్షన్స్ ఏజెన్సీకి అప్పగించడం జరిగిందని అన్నారు. టన్నల్ మట్టిపనులను ఈనెలాఖరులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ కు నివేదించారు. లైనింగ్ వర్క్స్ టన్నల్ తో పాటు బెడ్ వరకు ఆగస్టు20వ తేదీ లోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ కెనాల్ కు సంబంధించి భూ సేకరణపై సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, కరెంటు పోల్స్ షిఫ్టింగ్ పై కూడా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు ఈ సమావేశంలో హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ ఈ రాజా స్వరూప్ కుమార్, ఈ ఈ లు మురళి , శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు శెట్టి, ఏజెన్సీలు ఆర్ వి ఆర్ ఏజెన్సీ రఘురాం రాజు, కృష్ణయ్య, సార్ ఏజెన్సీ పూర్ణ ప్రసాద్, పాటిల్, వెంకట్రావు, ఎస్సార్ కంపెనీ మహేందర్ రెడ్డి, హెచ్ ఎన్ ఎస్ ఎస్ భూ సేకరణ ఇంతియాజ్ భాష తదితరులు పాల్గొన్నారు.

# హోం మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

**అగళి, జులై 18 ప్రభాతవార్త**

ఈ నెల 21వ తేది సోమవారం మడకశిర నియోజకవర్గంలో హం మంత్రి వంగల పూడి అని పర్యటిస్తారని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమంలో పాల్గొనడంతోపాటు మడకశిర పట్టణంలో బహిరంగ సభను ఏర్పాటు చేశారని, ఈ బహిరంగ సభకు అగళి మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తునహాజరైన విజయవంతం చేయాలని జడ్పిటిసి ఉమేష్, ఎంపిపి రేణుకా కామరాజు, కన్వీనర్ తిప్పేస్వామి కోరారు.

# బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్స్‌కు ఘన సన్మానం



బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్స్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ శివ తదితరులు

**బెలుగుప్ప, జులై 18 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో శుక్రవారం బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో బదిలీపై వెళ్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లకు ఎస్ఐ శివ, పోలీసు బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ మాట్లాడుతూ.. హెడ్ కానిస్టేబుల్ బాలనరసింహులు, పోలీస్‌కానిస్టేబుల్ జనార్ధన్ వెళ్తున్నకానిస్టేబుళ్లను వారు చేసిన సేవలను మండలంలో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించే విధంగా చేశారని, ఎన్నికల్లో కూడా మంచి సేవలు అందించారన్నారు. ఏఎస్ఐ రామదాసు, జందార్లు, వెళ్తున్న కానిస్టేబుళ్ల గురించి మరల ఉంటే కలుసుకుందామని వారికి తెలియ జేశారు. అనంతరం పోలీస్‌కానిస్టేబుల్స్ కు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు, జందార్ మల్లికార్జున, శివశంకర, శివ, నాగరాజు, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజినేయులు

**చెన్నైకొత్తపల్లి, జూలై 18 ప్రభాతవార్త**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని, వైద్య సిబ్బందికి శుక్రవారం ఫ్లోరోసిస్ వ్యాధి, నివారణ కార్యకలాపాలపై జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు ఆరోగ్య సిబ్బందికి, అలాగే, ఆరోగ్య కేంద్రానికి వచ్చిన, ప్రజలకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు ఫ్లోరోసిస్పై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్రస్థాయికి వెళ్లి, ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించి, ఆరోగ్య విద్య అందించాలని తెలియజేశారు. ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు మల్టీవిటమిన్ మాత్రలతో పాటు ఆహారపు అలవాట్ల గురించి తెలియజేయాలని పేర్కొన్నారు. వాటర్ శాంపిల్ సేకరణ చేసి అవసరం ఉన్నవారికి పునరావాస పరికరాల పంపిణీ చేయాలనీ తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని స్థూల స్థాయిలో అమలు చేయాలని, సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ప్రైమరీ స్కూల్ పిల్లలకి ఫ్లూరోసిస్ డెంటల్ స్క్రీనింగ్ కార్యక్రంలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఫ్లోరోసిస్, బాధితులకు, చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు, అందజేశామని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శశికల, మెడికల్ ఆఫీసర్ రవి నాయక్, హెల్త్ సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

